
సాక్షి గుంటూరు

మంగళవారం । 29 । ఏప్రిల్ । 2025



విఘ్నేశ్వరునికి పూజలు

పెదకూరపాడు: పెదకూరపాడు మండలం 75 త్యాళ్లూరులో విఘ్నేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా భక్తులు సోమవారం పూజలు చేశారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 514.40 అడుగుల వద్ద ఉంది. ఇది 139.2626 టీఎంసీలకు సమానం.

అరటిపండ్లతో విశేష పూజలు



సత్తెనపల్లి: సత్తెనపల్లి నాగన్నకుంటలోని శ్రీ కార్యసిద్ధి ఆంజనేయ స్వామి దేవాలయ వార్షికోత్సవ సందర్భంగా సోమవారం అరటిపండ్లతో శ్రీ కార్యసిద్ధి ఆంజనేయ స్వామిని అలంకరించి విశేష పూజలు నిర్వహించారు.

న్యూస్‌రీల్

ఆశ కార్యకర్తలకు యూనిఫాం పంపిణీ



గుంటూరు మెడికల్: జిల్లాలోని 1195 మంది ఆశ కార్యకర్తలకు ఒక్కొక్కరికి రెండు చొప్పున రాష్ట్ర ప్రభుత్వం సరఫరా చేసిన యూనిఫాం(చీరలు) డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి సోమవారం పంపిణీ చేశారు. స్థానిక డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ దాసరి శ్రీనివాసులు, డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు, డెప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఇ.అన్నపూర్ణ, డాక్టర్ రోహిణి రత్నశ్రీ, ఎన్టీఆర్ వైద్య సేవ జిల్లా కో–ఆర్డినేటర్ డాక్టర్ విజయప్రకాష్, డాక్టర్ జయరామకృష్ణ, డాక్టర్ ప్రియాంక, చంద్రశేఖర్, సురేష్ పాల్గొన్నారు.

రేపు గుంటూరులో జాబ్‌మేళా

గుంటూరు ఎడ్యుకేషన్: గుజ్జనగుండ్లలోని గుంటూరు జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో బుధవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి డి.దుర్గాబాయి సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎస్ఆర్ పాలిమర్స్, జెడ్ఎం క్యూర్ కోడ్ సర్వీసెస్, సిగ్నెట్ ఎలక్ట్రికల్స్, అను హాస్పిటల్స్, ఫెయిర్ డీల్ క్యాపిటల్, సెవెన్ హిల్స్ ఫార్మసీ సంస్థల్లో ఉద్యోగాలకు టెన్త్, ఐటీఐ, ఇంటర్, డిగ్రీ, బీటెక్, ఎంబీఏ, పీజీ వరకు చదువుకున్న 18 నుంచి 35 ఏళ్లలోపు వయసు గల నిరుద్యోగ యువతీ, యువకులు బయోడేటా, రెజ్యూమ్, విద్యార్హతల సర్టిఫికెట్లు, ఆధార్ జిరాక్స్, పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3.00 గంటల వరకు జరగనున్న ఇంటర్వ్యూలకు హాజరు కావాలని సూచించారు. ఇతర వివరాలకు 98668 22697 నంబర్లో సంప్రదించాలని తెలిపారు.

జీడీసీసీబీ చైర్మన్‌గా మక్కెన



జీడీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు



జీడీసీఎంఎస్ చైర్మన్ వడ్రాణం హరిబాబు

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంక్(జీడీసీసీబీ) చైర్మన్‌గా వినుకొండ నియోజకవర్గానికి చెందిన మాజీ శాసనసభ్యుడు మక్కెన మల్లికార్జునరావును నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. మల్లికార్జునరావు 2004 నుంచి 2009 వరకు వినుకొండ ఎమ్మెల్యేగా పనిచేశారు. గుంటూరు జిల్లా కో–ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ(జీడీసీఎంఎస్) చైర్మన్‌గా పొన్నూరు నియోజకవర్గానికి చెందిన వడ్రాణం హరిబాబును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వీరు ఇరువురు ఒకటి, రెండు రోజుల్లో పదవీ బాధ్యతలు స్వీకరించనున్నారు.

ప్రధాని పర్యటన ఏర్పాట్లు పరిశీలన



తాడికొండ: మే 2వ తేదీన భారత ప్రధాని నరేంద్ర మోదీ అమరావతి రాజధాని నిర్మాణ పనులు పునః ప్రారంభించేందుకు రానున్న నేపథ్యంలో ఏర్పాట్లను సోమవారం రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ వీర పాండ్యన్, జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి, గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ తదితరులు పరిశీలించారు. సభా ప్రాంగణం వద్ద చేపట్టాల్సిన ఏర్పాట్లు, వీవీఐపీలు, ప్రజలు ప్రయాణించే మార్గాలు, వాహనాల పార్కింగ్‌కు సంబంధించిన ప్రాంతాలను పరిశీలించి చేయాల్సిన ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో ఆర్డీవో కె శ్రీనివాసరావు, ఆర్అండ్‌బీ ఎస్ఈ శ్రీనివాసమూర్తి, రెవెన్యూ, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

రేపటి నుంచి బగళాముఖి అమ్మవారి కొలుపులు



చందోలు(కర్లపాలెం): చందోలులో శ్రీ బగళాముఖి అమ్మవారి వార్షిక కొలుపులు(తిరునాళ్ల) ఈనెల 30వ తేదీ నుంచి మే 5 వరకు జరుగుతాయని ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, మేనేజర్ నరసింహమూర్తి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

టూడీ.. మళ్లీ రండీ!

జీజీహెచ్‌లో టూడీ ఎకో పరీక్షలకు ఎదురుచూపులు

- అలంకారప్రాయంగా ఓపీ విభాగంలోని ఎకో మిషన్
- ఇన్‌పేషెంట్ విభాగం వద్ద తీవ్ర రద్దీ
- పరీక్షలు లేక చికిత్సకు జాప్యం
- జీజీహెచ్‌లో గుండెజబ్బుల రోగుల అవస్థలు
- పనిచేయని ఏసీలతో ఇక్కట్లు



శనివారం ఇన్‌పేషెంట్ విభాగం వద్ద వైద్య పరీక్షల కోసం వేచి చూస్తున్న రోగులు

గుంటూరు మెడికల్: పేదల పెద్ద ఆసుపత్రిగా పేరొందిన గుంటూరు జీజీహెచ్‌లో గుండె జబ్బు నిర్ధారణ పరీక్షల కోసం పేద రోగులు నానా అగచాట్లు పడాల్సి వస్తుంది. అసలే ఓ పక్క గుండె జబ్బు ఉందనే భయం వెంటాడుతుంటే, మరోపక్క వైద్య పరీక్ష నిర్ధారణకు రోజుల తరబడి వేచి చూడాలని వైద్యులు తెలియజేస్తుండటంతో మరింత తీవ్ర ఆందోళనతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. సుమారు ఏడు జిల్లాలకు చెందిన పేద రోగులు గుండె జబ్బుల చికిత్స కోసం జీజీహెచ్‌కు ఎంతో ఆశతో వస్తుంటే, వారిని తీవ్ర నిరాశ నిస్పృహలకు గురయ్యేలా వైద్యులు, వైద్య సిబ్బంది పనితీరు ఉంది.

రోగుల సహనానికి 'పరీక్ష'

జీజీహెచ్‌లో గుండెజబ్బు నిర్ధారణకు తొలుత ఈసీజీ పరీక్ష చేసి అనంతరం టూడీ ఎకో పరీక్ష చేస్తారు. ఈ పరీక్ష నివేదిక ఆధారంగానే గుండె జబ్బును నిర్ధారించి మందులు ఇవ్వడమా, లేక యాంజియోగ్రామ్ చేసి మరింత చికిత్స అందించడమా అనేది నిర్ధారిస్తారు. టూడీ ఎకో పరీక్ష కోసం వచ్చే రోగులకు అవస్థలు తప్పడం లేదు. ఇన్‌పేషెంట్ విభాగంలో టూడీ ఎకో పరీక్షల కోసం ఏర్పాటు చేసిన గది వద్ద సరిపడా గాలి, వెలుతురు లేకపోవడంతో వేసవి ఉక్కపోతలకు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. సరైన వసతులు లేక, కనీసం నిలబడేందుకు కూడా స్థలం లేక ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు.

జూనియర్ వైద్యులతోనే సరి!

కార్డియాలజీ విభాగంలో విభాగాధిపతి, అసోసియేట్ ప్రొఫెసర్, ముగ్గురు అసిస్టెంట్ ప్రొఫెసర్లు మొత్తం ఐదుగురు సీనియర్ వైద్యులు ఉన్నప్పటికీ గుండె జబ్బును నిర్ధారించే అత్యంత కీలకమైన టూడీ ఎకో పరీక్షను కేవలం పీజీ వైద్యులతోనే చేయిస్తూ సీనియర్ వైద్యులు సొంత ప్రాక్టీస్‌లో మునిగితేలుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఓపీ విభాగంలో దాతల సహాయంతో టూడీ ఎకో మిషన్ ఏర్పాటు చేయించినప్పటికీ దానిని అలంకార ప్రాయంగా ఉంచి, రోగులందరిని ఇన్‌పేషెంట్ విభాగంలోకి తరలిస్తున్నారు. దీంతో అక్కడ తీవ్రమైన రద్దీ ఏర్పడుతోంది.

ఏసీలు పనిచేయక అవస్థలు

ఒక పక్క గుండె జబ్బు నిర్ధారణకే గంటలు, రోజులు వేచి చూస్తున్న రోగులు అష్టకష్టాలు పడి వార్డులో చికిత్స కోసం చేరితే అక్కడ ఏసీలు పనిచేయక ఉక్కపోతతో అల్లాడిపోతున్నారు. ఎక్కువ రోజులు చికిత్స పొందుతున్న రోగులు తామే సొంతంగా ఫ్యాన్లు కొనుగోలు చేసుకుని మంచాల వద్ద పెట్టుకుంటున్న దుస్థితి పెద్ద ఆసుపత్రిలో నెలకొంది. సీసీయూ విభాగంలో ఏసీలు పనిచేయక వైద్యులు, వైద్య సిబ్బంది సైతం ఇబ్బందులు పడుతున్నారు. ఆసుపత్రి అధికారులు ఇకనైనా కళ్లు తెరిచి గుండె జబ్బు రోగుల కష్టాలు తొలగించేలా పనిచేయాలని పలువురు రోగులు కోరుతున్నారు.

మధ్యాహ్నం వరకే ..

ప్రతిరోజూ వంద మందికి మించి వైద్య పరీక్షలు చేయడం లేదు. అధిక సంఖ్యలో రోగులు వస్తే వారిని మరోరోజు రావాలంటూ డేట్లు ఫిక్స్ చేసి ఇళ్లకు పంపిస్తున్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిబంధనల ప్రకారం వైద్యులు పనిచేయాల్సి ఉంటుంది. కానీ కేవలం మధ్యాహ్నం భోజనం సమయం వరకే 2 గంటల్లోపే టూడీ ఎకో పరీక్షలను ఆపేస్తున్నారు. తద్వారా పేద రోగులు కేవలం పరీక్ష కోసమే రోజుల తరబడి, కొన్నిసార్లు ఉదయం వచ్చి మధ్యాహ్నం వరకు వేచి చూడాల్సి వస్తుంది. ఏళ్ల తరబడి ఈ సమస్య పేద రోగులను వేధిస్తున్నా, ఆసుపత్రి అధికారులు సమస్య పరిష్కారమయ్యేందుకు ప్రణాళికా బద్ధంగా పనిచేయడం లేదని విమర్శలు ఉన్నాయి. గుండె జబ్బుకు నిర్ధారణ చాలా కీలకం కాబట్టి, రోగులకు ఏరోజు కారోజే టూడీ ఏకో పరీక్ష చేసేలా వైద్య అధికారులు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

దీనిపై ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ యశ్వీ రమణను వివరణ కోరగా కార్డియాలజీ విభాగంలో గుండె జబ్బు రోగులకు త్వరితగతిన వైద్య పరీక్షలు జరిగేలా చూస్తామని తెలిపారు.

ఇదీ ఓ గెలుపేనా..?



మాట్లాడుతున్న అంబటి రాంబాబు, చిత్రంలో ఏసురత్నం, డైమండ్‌బాబు, నూరిఫాతిమా, వెంకటరెడ్డి

- తొమ్మిది నెలల పదవి కోసం ఇంత కక్కుర్తా ?
- కూటమి విజయం అనైతికం, అప్రజాస్వామికం
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు

పట్నంబజారు: కేవలం తొమ్మిది నెలల మేయర్ పదవి కోసం నానా గడ్డి కరిచి, కక్కుర్తి పడాల్సిన అవసరం కూటమి నేతలకు వచ్చిందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు ధ్వజమెత్తారు. బృందావన్ గార్డెన్స్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మేయర్ ఎన్నికకు సంబంధించి అచ్చాల వెంకటరెడ్డిని మేయర్ అభ్యర్థిగా పార్టీ అధిష్టానం నిర్ణయించిందని, వైఎస్సార్ సీపీకి 27 ఓట్లు రాగా, 34 ఓట్లు వచ్చాయని తెలిపారు. అయితే కేవలం 11 మంది కార్పొరేటర్లు మాత్రమే కూటమికి ఉన్నారని, వైఎస్సార్ సీపీ గుర్తుపై గెలిచిన 17 మందిని అక్రమంగా ప్రలోభాలకు గురి చేసి కొనుగోలు చేసి, ఏకంగా ఎంపీ, ఎమ్మెల్యేలు వెళ్లి వారికి కండువాలు కప్పారని ఆరోపించారు. వైఎస్సార్ సీపీకి చెందిన ఇద్దరు కార్పొరేటర్‌లు గైర్హాజర్ కావటంపై అనుమానాలు ఉన్నాయన్నారు.

నిస్సిగ్గుగా కొనుగోలు చేశారు..

2021 ఎన్నికల్లో జరిగిన కార్పొరేషన్ ఎన్నికల్లో కేవలం 12 మంది ఉన్న కూటమి, నిస్సిగ్గుగా వైఎస్సార్ సీపీ కార్పొరేటర్‌లను కొనుగోలు చేసిందన్నారు. ఫ్యాను గుర్తుపై గెలిచి, కూటమితో అంటకాగుతున్న కార్పొరేటర్‌లు, మీ అవసరం తీరాక వదిలేస్తారన్న విషయాన్ని గుర్తించాలని, గెలిచిన పార్టీని మోసం చేసిన మిమ్మల్ని ఎలా నమ్ముతారని ప్రశ్నించారు.

కూటమిది అనైతిక విజయం

విజ్ఞులైన ప్రజలు ఆలోచించాలని, కూటమిది అనైతిక విజయమని, అసలు ఇదీ విజ యమే కాదన్నారు.ఇండిపెండెంట్ అభ్యర్థిగా గెలుపొందిన కాండ్రుగుంట గురవయ్య సైతం వైఎస్సార్ సీపీకి మద్దతుగా నిలిచారని, పార్టీ గుర్తుపై గెలిచిన మీకు ఆ మాత్రం బుద్ధి లేదా అని సూటిగా ప్రశ్నించారు. అనైతిక విజయాన్ని మూటగట్టుకున్న కూటమి ప్రభుత్వం మూల్యం చెల్లించుకోకతప్పదని ప్రశ్నించారు. స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో సైతం ఇదే విధంగా సిగ్గులేకుండా వ్యవహరించారన్నారు. పార్టీ ఆదేశాలను ధిక్కరించిన కార్పొరేటర్‌ల అంశాన్ని అధిష్టానం, రీజనల్ కో–ఆర్డినేటర్ దృష్టికి తీసుకుని వెళ్తామని స్పష్టం చేశారు.

ప్రలోభాలతో గెలిచారు

వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా మాట్లాడుతూ మరోసారి టీడీపీ జంపింగ్ జపాంగ్‌ల పార్టీ అని నిరూపించుకుందని విమర్శించారు. ప్రలోభాలకు గురి చేసి గెలిచిన గెలుపు ఒక గెలుపేనా అని మండిపడ్డారు. 24 మంది కార్పొరేటర్లు నిజాయితీ, నిబద్ధతతో పార్టీకి అండగా నిలిచారని వారికి అభినందనలు తెలిపారు. మేయర్‌గా పోటీ చేసిన అచ్చాల వెంకటరెడ్డి మాట్లాడుతూ తనను అభ్యర్థిగా నిలబెట్టిన వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, తనకు ఓట్లు వేసి ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, చంద్రగిరి ఏసురత్నం, కార్పొరేటర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం, నగర డిప్యూటీ మేయర్ బాలవజ్రబాబు, కార్పొరేటర్లు పడాల సుబ్బారెడ్డి, రామబోయిన అజయ్‌యాదవ్, కాండ్రుగుంట గురవయ్య, ఈచంపాటి వెంకటకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అర్జీదారులతో మర్యాదగా మెలగండి

డీఆర్‌ఓ షేక్ ఖాజావలి



అర్జీలు స్వీకరిస్తున్న ఆర్డీఓ ఖాజావలి

గుంటూరు వెస్ట్: అర్జీలు ఇచ్చేందుకు వచ్చే ప్రజలతో మర్యాదపూర్వకంగా మెలగాలని జిల్లా రెవెన్యూ అధికారి షేక్ ఖాజావలి పేర్కొన్నారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో డీఆర్‌ఓ అర్జీలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ అర్జీల పరిష్కారానికి అధికారులు చిత్తశుద్ధితో కృషి చేయాలన్నారు. అనంతరం వచ్చిన 184 అర్జీలను డీఆర్‌ఓతో పాటు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లక్ష్మీకుమారి, డీపీఓ సాయి కుమార్, స్టెప్ సీఈఓ చంద్రముఖి, జిల్లా అధికారులు పరిశీలించారు.

ఆధారం లేదు.. ఆదుకోండి



నా రెండు కాళ్లు పూర్తిగా చచ్చుబడిపోయాయి. తండ్రి లేరు. అమ్మ కుట్టు మిషన్ సంపాదనతో నెట్టుకొస్తున్నాం. రోజులు భారంగా గడుస్తున్నాయి. ఉండడానికి ఇల్లు కూడా లేదు. నాకు చిన్న ఇల్లు ఇప్పించండి.

– సీహెచ్ మౌనిక, తల్లి విజయలక్ష్మి, గుంటూరు



కాళ్లు విరగ్గొట్టారు..

పౌరహిత్యం చేసుకుని ఉన్నదాంట్లో తింటూ నెట్టుకొస్తున్నాం. ఇంటి నిర్మాణ సమయంలో మెట్ల ఉమాదేవి అనే మహిళ వద్ద నగదును అప్పుగా తీసుకుని 85 శాతానికి పైగా చెల్లించినా ఆమె రౌడీయిజం చేస్తుంది. రెండు రోజుల క్రితం ఇంటిపై దాడికి వచ్చి కాళ్లు విరగ్గొట్టించింది. నా బిడ్డల పైనా చేయిచేసుకున్నారు. పోలీసులు పట్టించుకోవడంలేదు. కాపాడండి

– ఘంటసాల పార్వతీ నందన్, కుటుంబ సభ్యులు, పొన్నూరు

స్పౌజ్ పేరిట కొత్త మెలిక

- వితంతు పింఛన్ అర్థమే మార్చివేసిన కూటమి ప్రభుత్వం
- ఏ దేనీ పింఛన్ పొందుతూ మృతిచెందిన భర్త స్థానంలోనే భార్యకు పింఛన్
- 2023 డిసెంబర్ 1 నుంచి 2024 అక్టోబర్ 31 మధ్య చనిపోయిన వారి భార్యలే దరఖాస్తు చేయాలంటూ మెలిక
- స్పౌజ్ కేటగిరీ పేరుతో వితంతు పింఛన్లు మంజూరు



నెహ్రూనగర్: వితంతువులకు పింఛన్లు మంజూరు చేసి వారి జీవితాల్లో సరికొత్త వెలుగులు నింపాల్సిన కూటమి ప్రభుత్వం అందుకు విరుద్ధంగా చర్యలు చేపట్టింది. వితంతు పింఛన్ల మంజూరును ఓ తంతుగా మార్చింది. స్పౌజ్ కేటగిరీలోనే పింఛన్లు మంజూరు చేసేందుకు ఏర్పాటు చేస్తోంది. ఏదైనా కేటగిరీలో పింఛన్ పొందుతున్న భర్త మృతి చెందితే, అతని భార్యకు మాత్రమే పింఛన్ మంజూరు చేసేలా నిబంధనలు విధించింది.

దరఖాస్తులు స్వీకరిస్తే ఒట్టు

కూటమి అధికారం చేపట్టిన తరువాత కొత్త పింఛన్లను మంజూరు చేయలేదు. కనీసం అర్హుల నుంచి దరఖాస్తులు కూడా స్వీకరించిన పాపాన పోలేదు. తాజాగా స్పౌజ్ కేటగిరీ పేరుతో వితంతు పింఛన్ల మంజూరు అంటూ అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. అయితే ఇక్కడా ఓ మెలిక పెట్టింది. ఏదైనా కేటగిరీలో పింఛన్ పొందుతూ భర్త మరణించిన భార్యకు స్పౌజ్ కేటగిరీ పేరుతో పింఛన్ మంజూరు చేయాలని నిర్ణయించింది. అది కూడా నిర్దిష్ట కాలానికి మాత్రమేనని మెమోలో స్పష్టం చేసింది. ఎవరైనా వ్యక్తి ఎన్టీఆర్ భరోసా పింఛన్ పొందుతూ డిసెంబర్ 2023 నుంచి అక్టోబర్ 2024 మధ్య చనిపోతే అతని భార్యను స్పౌజ్ కేటగిరీ కింద అర్హురాలిగా గుర్తిస్తారు. అక్టోబర్ తర్వాత భర్త మరణించిన మహిళకు పింఛన్ లేనట్లే. ఇది కూటమి ప్రభుత్వం వితంతు పింఛన్లకు విధించిన షరతు. ఇక సాధారణంగా ఎటువంటి సామాజిక పింఛన్ పొందని వారి కుటుంబాల్లో భర్త చనిపోయినా వారికి వితంతు పింఛన్ మంజూరు ఇప్పట్లో లేనట్లేనని ప్రభుత్వం చెప్పకనే చెప్పింది.

50 ఏళ్లకే పింఛన్ అమలు హుళక్కే!

గుంటూరు జిల్లాలో ప్రస్తుతం 2,52,715 మందికి పింఛన్లు వస్తున్నాయి. గత ప్రభుత్వ హయాంతో పోలిస్తే కూటమి ప్రభుత్వంలో సుమారు 7వేల దాకా పింఛన్లు ఆగిపోయాయి. ప్రస్తుతం స్పౌజ్ కేటగిరీ కింద 2023 డిసెంబర్ 1 నుంచి 2024 అక్టోబర్ 31 మధ్య 3,437 మంది పింఛన్‌దారులు చనిపోయారని, వారి భార్యలు స్పౌజ్ కేటగిరీ కింద సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. అదేవిధంగా కూటమి ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు 50 ఏళ్లకే పింఛన్ మంజూరు చేస్తామని హామీ ఇచ్చింది. ఇప్పటికీ 50 ఏళ్లు నిండిన వారు పింఛన్ కోసం ఎదురు చూస్తున్నారు. వారి నుంచి ప్రభుత్వం కనీసం దరఖాస్తులు కూడా తీసుకోవడం లేదు.

వైఎస్సార్ సీపీ హయాంలో...

గత ప్రభుత్వం వలంటీర్, సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చి సంక్షేమ పథకాలను అర్హుల ఇళ్లకే డోర్ డెలివరీ చేసింది. 50 ఇళ్లకో వలంటీర్‌ను నియమించి ఆయా కుటుంబాల్లో అర్హత ఉన్న వారిని పథకాలకు దరఖాస్తు చేయించేవాళ్లు. 35 ఏళ్ల వయస్సు పైబడిన మహిళలకు భర్త చనిపోతే ఆ మరుసటి నెలలోనే వితంతు పింఛన్ అందించేవారు.

కూటమి ప్రభుత్వంలో ఇలా..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఒక్క సామాజిక పింఛన్ కూడా మంజూరు కాలేదు. పది నెలలుగా దరఖాస్తులు కూడా స్వీకరించలేదు. పైగా స్పౌజ్ కేటగిరీ పేరుతో వితంతువులకు నిబంధనలు విధించడంతో అర్హత కలిగిన వితంతువులు పింఛన్లు పొందలేని పరిస్థితి నెలకొంది. పింఛన్ల కోసం దరఖాస్తు చేసేందుకు వారం వారం అర్హులు ప్రభుత్వ కార్యాలయాలకు క్యూ కడుతున్నారు. ప్రభుత్వ నిర్ణయంతో వారికి ఎదురుచూపులు తప్పేలా లేవు

ఈ నెలఖారులోగా దరఖాస్తు చేసుకోవాలి

గుంటూరు జిల్లాలో ప్రస్తుతం స్పౌజ్ కేటగిరీ కింద 2023 డిసెంబర్ 1 నుంచి 2024 అక్టోబర్ 31 మధ్య 3,437 మంది పింఛన్‌దారులు చనిపోయారు. వారి భార్యలు స్పౌజ్ కేటగిరీ కింద సచివాలయంలో ఈ నెలఖారులోగా దరఖాస్తు చేసుకోవాలి.

– విజయలక్ష్మి, పీడీ, డీఆర్‌డీఏ

నగర మేయర్‌గా కోవెలమూడి రవీంద్ర

- 63 మంది సభ్యులకు 61 మంది హాజరు
- ఇద్దరు వైఎస్సార్ సీపీ సభ్యులు గైర్హాజరు
- కూటమి అభ్యర్థి కోవెలమూడికి 34, వైఎస్సార్ సీపీ అభ్యర్థి అచ్చాల వెంకటరెడ్డికి 27 ఓట్లు



మేయర్ కోవెలమూడి రవీంద్రకు శుభాకాంక్షలు తెలుపుతున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ 7వ మేయర్‌గా టీడీపీ నుంచి కోవెలమూడి రవీంద్ర ఎన్నికయ్యారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు సోమవారం ప్రిసైడింగ్ అధికారి, జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ తేజ ఆధ్వర్యంలో గుంటూరు నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో ఉదయం 11 గంటలకు మేయర్ ఎన్నిక నిర్వహించారు. ఎన్నికల ప్రత్యేక సమావేశానికి ఎక్స్ అఫీషియో సభ్యులు కేంద్ర మంత్రి, గుంటూరు ఎంపీ డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్సీలు చంద్రగిరి ఏసురత్నం, లేళ్ల అప్పిరెడ్డి, ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్యేలు మహ్మద్ నసీర్, డాక్టర్ బి.రామాంజనేయులు, గల్లా మాధవి, కార్పొరేటర్లు హాజరయ్యారు. ముందుగా ఎన్నికల అధికారి సభ్యుల హాజరు సేకరించారు. సమావేశానికి 61 మంది హాజరవ్వగా, కోరం సగభాగం ఉన్నందున ప్రిసైడింగ్ అధికారి మేయర్ ఎన్నికకు సంబంధించి టీడీపీ నుంచి కోవెలమూడి రవీంద్ర, వైఎస్సార్ సీపీ నుంచి అచ్చాల వెంకటరెడ్డి పోటీలో ఉన్నారని ప్రకటించారు.

రవీంద్రకు 34, వెంకటరెడ్డికి 27 ఓట్లు..

కోవెలమూడి రవీంద్రను ప్రత్తిపాడు ఎమ్మెల్యే బి.రామాంజనేయులు ప్రతిపాదించగా 13 డివిజన్ కార్పొరేటర్ సంకూరి శ్రీనివాసరావు బలపరిచారు. అచ్చాల వెంకటరెడ్డిని ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం ప్రతిపాదించగా 45వ డివిజన్ కార్పొరేటర్ యక్కలూరి మారుతి బలపరిచారు. అనంతరం జరిగిన ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి కోవెలమూడి రవీంద్రకు 34, వైఎస్సార్ సీపీ అభ్యర్థి అచ్చాల వెంకటరెడ్డికి 27 ఓట్లు వచ్చాయి. అత్యధిక ఓట్లు వచ్చిన టీడీపీ అభ్యర్ధిర్థి కోవెలమూడి రవీంద్ర మేయర్‌గా విజయం సాధించినట్లు ప్రిసైడింగ్ అధికారి ప్రకటించి, ధ్రువీకరణ పత్రం అందించి, మేయర్‌గా ప్రమాణస్వీకారం చేయించారు. ప్రమాణస్వీకారం అనంతరం రవీంద్ర మేయర్ ఛాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు, అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, కౌన్సిల్ సెక్రటరి బి.శ్రీనివాసరావు, డిప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, సిహెచ్.శ్రీనివాస్, ఎన్నికల విభాగ సూపరింటెండెంట్ పద్మనాభరావు తదితరులు పాల్గొన్నారు.

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో సోమవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. **6,500** గరిష్ఠం : రూ. **9,600**

మోడల్ ధర రూ. **7,400**

క్లుప్తంగా

పసుపు ధరలు

దుగ్గిరాల: దుగ్గిరాల పసుపు యార్డుకు సోమవారం 875 బస్తాలు వచ్చాయి. పసుపు మొత్తం అమ్మకం చేసినట్లు వ్యవసాయ మార్కెట్ యార్డు కార్యదర్శి ఎస్.శ్రీనివాసరరావు ఒక ప్రకటనలో తెలిపారు.

- కొమ్ములు 595 బస్తాలు రాగా, వాటి కనిష్ట ధర రూ.10,000. గరిష్ట ధర రూ.11,950, మోడల్ ధర రూ.11,400 పలికాయి.
- కాయలు 280 బస్తాలు వచ్చాయి. వాటి కనిష్ట ధర రూ.10,000, గరిష్ట ధర రూ.11,400, మోడల్ ధర రూ.11,200, మొత్తం 656.250 క్వింటాళ్ల అమ్మకాలు జరిగినట్లు ఆయన తెలిపారు.

అలరించిన నృత్య నాటిక



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం అన్నమయ్య కళావేదికపై శ్రీసాయి మంజీర కూచిపూడి ఆర్ట్ అకాడమీ నిర్వహిస్తోన్న అంతర్జాతీయ నృత్య దినోత్సవ వేడుకల్లో భాగంగా శ్రీమహా మంజీర నాదం సోమవారం ఆరో రోజుకి చేరాయి. ఆలయ ప్రధాన కార్యదర్శి పుట్టగుంట ప్రభాకర్‌రావు జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. డాక్టర్ భూసురపల్లి వెంకటేశ్వరరావు సభకు అధ్యక్షత వహించారు. అనంతరం సీనియర్ మేకపమెన్ ఆచారి (పసుపులేటి మద్దిలేటి)కి అపురూప రూప శిల్పి బిరుదుతో సంస్థ కార్యదర్శి డాక్టర్ కాజ వేంకటసుబ్రహ్మణ్యం సత్కరించారు.

సమస్యలకు సత్వర పరిష్కారం

పోలీసు పీజీఆర్‌ఎస్‌లో ఏఎస్పీ జీవీ రమణమూర్తి



బాధితుల సమస్యలు ఆలకిస్తున్న జిల్లా ఏఎస్పీ రమణరావు

నగరంపాలెం: జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో సోమవారం ప్రజా ఫిర్యాదులు-పరిష్కారాల వేదిక (పీజీఆర్‌ఎస్) నిర్వహించారు. జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు జిల్లా ఏఎస్పీ (పరిపాలన) జీవీ రమణమూర్తి బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఫిర్యాదిదారుల సమస్యలకు చట్ట పరిధిలో పరిష్కారం చూపుతామని సూచించారు. మహిళలు, వృద్ధుల ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. నగరంపాలెం పీఎస్ సీఐ నజీర్‌బేగ్, పట్టాభిపురం పీఎస్ సీఐ గంగా వెంకటేశ్వర్లు, సీఐ కృష్ణయ్య కూడా అర్జీలు స్వీకరించారు.

పత్తి ఇప్పిస్తానని రూ.20లక్షలు మోసం



చాన్నాళ్లుగా పత్తి వ్యాపారం చేస్తుంటాను. మూడేళ్ల క్రితం సత్తెనపల్లి గుడిపూడి వాసి పత్తి ఇప్పిస్తానని నమ్మబలికాడు. దీంతో అతనికి రూ.20 లక్షలు గుంటూరు నగరాలులోని ఇంటి వద్ద చెల్లించాను. నెల రోజుల్లో పత్తి ఇప్పిస్తానని చెప్పి ఏళ్ల గడిచాయి. అతని ఇంటి వద్దకెళ్లి డబ్బుల విషయమై అడిగితే బెదిరింపులకు పాల్పడుతున్నాడు. అదేమని అడిగితే ఇష్టంవచ్చిన చోట చెప్పుకో అంటూ హుకుం జారీచేస్తున్నారు. న్యాయం చేయగలరు.

– దేగల రమణరావు, నగరాలు

అధిక పెట్టుబడులు వస్తాయని..

కొద్దికాలం క్రితం తెలిసిన ఇద్దరి వ్యక్తుల ద్వారా అన్‌లైన్ యాప్‌లో చేరాను. గతంలో గుంటూరు లక్ష్మీపురంలో కార్యాలయం ఉండేది. ఇటీవల ఆ కార్యాలయాన్ని తొలగించారు. వేరే ఫోన్ యాప్ ద్వారా వారికి రూ.5.04 లక్షలు చెల్లించాను. ప్రస్తుతం వారి మొబైల్‌ఫోన్‌కు చేస్తే స్విచ్ఛాఫ్ వస్తోంది. యాప్‌లో పెట్టుబడి పెడితే పెద్ద మొత్తంలో నగదు వస్తోందని ఆశ చూపారు. సదరు ఇద్దరి వ్యక్తులపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని కోరుతున్నా.

– ఎస్‌ఎం.మొహినుద్దీన్, పెదకాకాని మండలం

నిత్యాన్నదాన పథకానికి రూ.1,11,116 విరాళం



ఆలయ డీసీ గోగినేని లీలాకుమార్‌కు విరాళాన్ని అందజేస్తున్న పూనూరు బసివిరెడ్డి దంపతులు

పెదకాకాని: శివాలయంలో అన్నదాన పథకానికి దాతలు ముందుకు రావడం అభినందనీయమని శివాలయం డిప్యూటీ కమిషనర్ గోగినేని లీలాకుమార్ అన్నారు. పెదకాకాని శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో జరుగుతున్న నిత్య అన్నదాన పథకానికి గుంటూరు కొరిటెపాడుకు చెందిన పూనూరు బసివిరెడ్డి, శైలజ దంపతులు రూ.1,11,116 అందజేశారు. ఈ విరాళం మొత్తాన్ని పూనూరు మాలకొండారెడ్డి జ్ఞాపకార్థం ఆలయ డిప్యూటీ కమిషనర్ గోగినేని లీలాకుమార్‌కు అందజేశారు. డీసీ మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి, నిత్య అన్నదాన పథకానికి భక్తులు విరివిగా విరాళాలు సమర్పించి ఆలయ అభివృద్ధికి సహకరించాలని కోరారు. దాతలకు ప్రత్యేక దర్శనం, వేద ఆశీర్వచనం చేయించి స్వామివారి శేషవస్త్రంతో సత్కరించి స్వామివారి చిత్రపటం అందజేశారు.

మే 3న డీఎస్సీపై అవగాహన సదస్సు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు, డీవైఎఫ్ఐ జిల్లా నాయకులు

లక్ష్మీపురం: డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో మే మూడో తేదీ సాయంత్రం 4గంటలకు గుంటూరు బ్రాడీపేటలోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో డీఎస్సీపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నామని, అభ్యర్థులందరూ హాజరై జయప్రదం చేయాలని మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణరావు కోరారు. గుంటూరు బ్రాడీపేటలోని డీవైఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో అవగాహన సదస్సు పోస్టర్‌ని సోమవారం ఆయన ఆవిష్కరించారు. లక్ష్మణరావు మాట్లాడుతూ ఆందోళన ఫలితంగా డీఎస్సీ నోటిఫికేషన్ వచ్చిందన్నారు. నోటిఫికేషన్‌పై అభ్యర్థులు 4 ప్రధాన అభ్యంతరాలను తెలుపుతున్నారన్నారు. సదస్సుకు హాజరయ్యే అభ్యర్థులకు ఎడ్యుకేషన్‌సైకాలజీ, ఎస్జీటీ అభ్యర్థులకు గణితంపై కంటెంట్ బుక్ ఉచితంగా అందిస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని అభ్యర్థులందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డీవైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ వై.కృష్ణకాంత్ మాట్లాడుతూ పోటీ పరీక్షల నిపుణులు కె.ఎస్.లక్ష్మణరావు, సబ్జెక్ట్ నిపుణులు పాల్గొని వివరిస్తారని తెలిపారు. వివరాల కోసం 9490099992 నంబర్‌లో సంప్రదించాలని కోరారు. సమావేశంలో జిల్లా నాయకులు ఎం.కిరణ్, ఎస్.కె.సమీర్, ఎస్.పద్మ, సుభానీ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు సత్వరం చెల్లించాలి



ధర్నా నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన పథకం కార్మికులు, సీఐటీయూ నాయకులు

లక్ష్మీపురం: ఐదు నెలల పెండింగ్ వేతనాలు సత్వరమే చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఏపీ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో సోమవారం గుంటూరులోని కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు దండా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ 2024 డిసెంబర్ నుంచి నేటి వరకు జీతాలు, బిల్లులు పడకపోవడం వల్ల మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురి అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకవైపు పిల్లలకు పౌష్టికాహారం అందించాలని చెప్పే రాష్ట్ర ప్రభుత్వం, పౌష్టికాహారం అందించడానికి తోడ్పడే మధ్యాహ్న భోజన కార్మికులపై వివక్ష చూపించడం మానుకోవాలన్నారు. ఐదు నెలల నుంచి బిల్లులు రాకపోతే కుటుంబాలు గడుస్తాయని ఆలోచన చేయకపోవడం విచారకరమన్నారు. అనంతరం గ్రీవెన్స్ వినతి పత్రం అందించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బి.లక్ష్మణరావు, యూనియన్ నాయకులు చింతల శ్రీనివాసరావు, మర్రి లక్ష్మి, రెడ్డి రమణమ్మ, జ్యోతి, ముక్తేశ్వరమ్మ, సుబ్బాయమ్మ తదితరులు పాల్గొన్నారు.


యూబీఐ మెగా ఎంఎస్‌ఎంఈ క్యాంపు



చెక్కు అందజేస్తున్న రేణు నాయర్

కొరిటెపాడు: యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో సోమవారం జీటీ రోడ్డులోని యూబీఐ రీజనల్ కార్యాలయంలో మెగా ఎంఎస్ఎంఈ, కాసా అవుట్ రీచ్ క్యాంపు నిర్వహించారు. యూబీఐ జనరల్ మేనేజర్ రేణు నాయర్ చేతుల మీదుగా ఎంఎస్‌ఎంఈ రుణ గ్రహీతలకు రూ.100 కోట్ల రుణ మంజూరు పత్రాలు అందజేశారు. యూబీఐ జనరల్ మేనేజర్ రేణు నాయర్ మాట్లాడుతూ ఖాతాదారుల సౌకర్యార్థం యూబీఐ సేవలను మరింత విస్తరించనున్నట్లు స్పష్టం చేశారు. మహిళ రుణ గ్రహీతలకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. రుణ గ్రహీతలందరిని బ్యాంకు ద్వారా ప్రోత్సహించడం గర్వనీయమని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో యూబీఐ రీజనల్ హెడ్ ఎస్.జవహర్, డెప్యూటీ రీజనల్ హెడ్స్ అశ్వర్థ నాయక్, ఏ.రాజేష్, ఎంఎల్‌పీహెడ్ హరేరామ్‌షా, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

తెనాలిలో ఆటోడ్రైవర్ దారుణ హత్య



ఘటనాస్థలంలో రాజు మృతదేహం

తెనాలిరూరల్: తెనాలి త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆటో డ్రైవర్ దారుణ హత్యకు గురయ్యాడు. నిర్మానుష్య ప్రదేశంలోకి తీసుకెళ్లి కత్తి, ఇటుకలతో దాడి చేసి హతమార్చారు. మల్లెపాడు పంచాయతీ పరిధిలోని వెలగ్గుంట చెరువులో ఆదివారం రాత్రి ఘటన జరిగింది. సోమవారం మధ్యాహ్నం అటుగా వెళ్లిన వారు గమనించి పోలీసులకు సమాచారమిచ్చారు. త్రీ టౌన్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడి మెడ చుట్టూ, తలమీద కత్తులతో పొడిచిన ఆనవాళ్లు ఉన్నాయి. గుంటూరు నుంచి వచ్చిన క్లూస్ టీం ఆధారాలు సేకరించేందుకు ప్రయత్నించింది. మృతుడిని మండలంలోని జగ్గడిగుంటపాలెం పంచాయతీ పరిధిలోని టిడ్కో గృహాల్లో నివసించే గండికోట రాజు(25)గా గుర్తించారు. కుటుంబ కలహాల నేపథ్యంలో హత్య జరిగినట్టు పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు. కేసు దర్యాప్తులో పూర్తి వివరాలు తెలిస్తాయని సీఐ ఎస్.రమేష్‌బాబు తెలిపారు.

ఎస్పీ కార్యాలయ ఆవరణలో ఇద్దరు మహిళల ఘర్షణ

నగరంపాలెం: ఫిర్యాదుదారులైన ఇద్దరు మహిళలు ఒకరిపై ఒకరు కొట్లాటకు దిగారు. నగరంపాలెం గుంటూరు జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణ (డీపీఓ)లో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక వద్ద ఈ ఘటన జరిగింది. ఈ సంఘటన పోలీస్ శాఖలో చర్చనీయాంశంగా మారింది. గుంటూరు రూరల్ పరిధిలోని ఓ గ్రామానికి చెందిన మహిళ ప్రజా ఫిర్యాదులు- పరిష్కారాల వ్యవస్థ (పీజీఆర్‌ఎస్) ఫిర్యాదు చేసేందుకు వచ్చారు. గత సోమవారం కూడా వచ్చిన ఆమె పోలీస్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయకుండానే వెనుదిరిగారు. అయితే సోమవారం వచ్చిన ఆమె సమావేశ మందిరంలో ఫిర్యాదు చేసేందుకు బయట కుర్చీలో వేచి ఉన్నారు. ఈ లోగా పాతగుంటూరులోని ఓ సచివాలయంలో పనిచేసే మహిళ వేచియున్న మహిళ వద్దకు వచ్చింది. ఇద్దరు వాగ్వివాదం చేసుకున్నారు. ఒకనొక దశలో ఇద్దరు జుట్లు పట్టుకుని తన్నుకుని గొడవకు దిగారు. ఈలోగా పెద్దగా కేకలు వినిపించడంతో అక్కడే ఉన్న పోలీస్ సిబ్బంది వచ్చి ఇద్దరి బాధిత మహిళలకు సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. అయితే రూరల్ పరిధిలోని ఓ గ్రామానికి చెందిన మహిళకు చేతులపై గోళ్లతో రక్కినట్లు స్వల్ప గాయాలయ్యాయి. అనంతరం ఆమె సమావేశం మందిరంలోని పోలీస్ ఉన్నతాధికారికి ఫిర్యాదు చేసి వెనుదిరిగారు. తర్వాత పాతగుంటూరుకు చెందిన మరో మహిళ అర్జీ రాసుకుని పోలీస్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. అయితే వీరిద్దరి మధ్య గొడవలో ఓ పోలీస్ అధికారి ప్రమేయం ఉన్నట్లు పోలీస్ శాఖలో చర్చించుకుంటున్నారు.

ఆత్మస్థైర్యంతో మంచి ఫలితాలు సాధించాలి

బల్లికురవ: పదో తరగతి, ఇంటర్మీడియట్ ఫెయిలైన విద్యార్థుల కోసం మేలో జరిగే సప్లిమెంటరీ పరీక్షల్లో మంచి మార్కులతో పాటు పర్సంటేజ్ మార్కులు పెంచుకోవాలని సర్వశిక్ష అభియాన్ జీసీడీవో చారులత కోరారు. ఆమె సోమవారం బల్లికురవ, సంతమాగులూరు మండలంలోని ఏల్చూరులో జరుగుతున్న సప్లిమెంటరీ పరీక్షల శిక్షణ తరగతులను, అదనపు గదుల నిర్మాణ పనులను పరిశీలించారు. 20 రోజుల పాటు కష్టం పడటంతోపాటు ఇష్టపడి చదవాలని విద్యార్థులకు సూచించారు.

అటు మట్టి దందా..ఇటు ఆక్రమణలు

లాంలో టీడీపీ నాయకుల దౌర్జన్యాలు, అక్రమాలు



లాంలో కొండపోరంబోకు భూమిని మట్టితో పూడ్చి ఆక్రమించిన వైనం

లాం(తాడికొండ): తాడికొండ మండలం లాం గ్రామంలో ఓ వైపు మట్టి దందా, మరో వైపు స్థలాల వరుస ఆక్రమణలు కొనసాగుతున్నాయి. ప్రశ్నించాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో చెరువును చెరబట్టి రూ.కోట్ల విలువైన మట్టిని అమ్ముకొని జేబులు నింపుకొంటున్న తెలుగు తమ్ముళ్ళు ఇప్పుడు మరో అడుగు ముందుకేసి ఆక్రమణల పర్వానికి తెరలేపారు. కొండ పోరంబోకులో మట్టిని తోలి చదును చేసుకొంటున్నారు. అధికారులు పట్టించుకోకపోవడంతో ఆక్రమణల పర్వం మరింతగా పెరిగే ప్రమాదం ఉందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. – లాం నుంచి జొన్నలగడ్డ వెళ్లే ప్రధాన రహదారిలో టీడీపీ నాయకులు కొండను మింగేసి మట్టిని తోలి పూడ్చివేసి ఆక్రమణల పర్వానికి తెరలేపారు. టీడీపీ అధికారంలోకి రాగానే కక్షపూరితంగా జానెడు జాగాలో ఇళ్ళు నిర్మించుకొని నివసిస్తున్న పేదల ఇళ్లను 40కి పైగా పొక్లెయిన్లతో కూల్చారు. మరి కొంత మందికి నోటీసులిచ్చి, తమకు సహకరించాలని బెదిరింపులకు గురిచేస్తున్నాడు. వీరి దుర్మార్గ వ్యవహారాలకు సహకరిస్తున్న అధికారులు సామాన్యులను మాత్రం వేధింపులకు గురిచేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఆక్రమణల పర్వానికి తెరదించాలని పలువురు కోరుతున్నారు.

అర్జీదారులకు అన్నదానం

ఏర్పాటుచేసిన జిల్లా ఆర్యవైశ్య సంఘం



నరసరావుపేట: జిల్లా కలెక్టర్, ఎస్పీ కార్యాలయాల్లో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్)లలో అర్జీలు, ఫిర్యాదులు అందజేసేందుకు జిల్లా నలుమూలల నుంచి అనేక సమస్యలతో వచ్చేవారికి జిల్లా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. దీనికి శిఖాకొల్లి రాజేష్ (గుణ రాజేష్), చితిరాల అనిల్ కుమార్ సహకరించారు. కలెక్టర్ కార్యాలయంలో అన్నదానాన్ని జిల్లా జిల్లా ఫారెస్ట్ అధికారి జి.కృష్ణప్రియ ప్రారంభించగా, ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమాన్ని ఆర్ఐ కృష్ణ ప్రారంభించి దాతలను సన్మానించారు. వారికి నిర్వహణ కమిటీ ప్రత్యేక ధన్యవాదాలు తెలియచేశారు. జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు అత్తులూరి సుబ్బారావు, తాడువాయి రామకృష్ణ, గౌరు శ్రీనివాసరావు, రెడ్డి మురళీకృష్ణ, వనమా ప్రభాకర్ పాల్గొన్నారు.

రైతులను ఇబ్బంది పెడితే చర్యలు

జిల్లా వ్యవసాయ అధికారి నున్నా వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న నున్నా వెంకటేశ్వర్లు, వేదికపై శ్రీనివాసరావు, రమణకుమార్, రామకోటేశ్వరి

కొరిటెపాడు(గుంటూరు): జూన్ మాసం నుంచి ప్రారంభం కానున్న ఖరీఫ్ సీజన్‌లో రైతులకు ఇబ్బందులు లేకుండా ఎరువులు, విత్తనాలు సరఫరా చేయాలని, ఎక్కడ నుంచి ఫిర్యాదు వచ్చినా చర్యలు తప్పవని గుంటూరు జిల్లా వ్యవసాయ అధికారి నున్నా వెంకటేశ్వర్లు హెచ్చరించారు. స్థానిక కృషీ భవన్‌లో సోమవారం సాయంత్రం విత్తన కంపెనీ ప్రతినిధులు, డిస్ట్రిబ్యూటర్స్‌తో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఖరీఫ్ సీజన్‌లో విత్తనాలు సరఫరా చేయాలని సూచించారు. ఎమ్మార్పీకి మించి ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు విక్రయిస్తే లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు. కాలం చెల్లిన విత్తనాలు, పురుగు మందులను రైతులకు అంటగడితే కేసులు నమోదు చేస్తామన్నారు. విక్రయ కేంద్రాల వద్ద విధిగా ధరల పట్టికతోపాటు స్టాకు వివరాల బోర్డులు వేలాడదీయాలన్నారు. విత్తన కంపెనీల ప్రతినిధులు మాట్లాడుతూ రాబోవు ఖరీఫ్ సీజన్‌లో అన్ని రకాల పత్తి, మిరప విత్తనాలను అందుబాటులో ఉంచి రైతులకు ఇబ్బందులు లేకుండా సరఫరా చేస్తామని స్పష్టం చేశారు. ఖరీఫ్ సీజన్‌లో గుంటూరు జిల్లాలో 75 వేల ఎకరాల్లో పత్తి సాగు అవుతుందని, దీనికిగాను 2 లక్షల పత్తి విత్తన ప్యాకెట్లు అవసరమవుతాయని అధికారులు సూచించగా, అంతకన్నా ఎక్కువ ప్యాకెట్లు సరఫరా చేస్తామని విత్తన కంపెనీ ప్రతినిధులు, డిస్ట్రిబ్యూటర్లు తెలిపారు. గుంటూరు ఏడీఏ తోటకూర శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్లైసిల్(హెచ్‌టీ) పత్తి విత్తనాలు విక్రయిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో పాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో పొన్నూరు ఏడీఏ వి.రామకోటేశ్వరి, ఏఓ కె.రమణకుమార్, 15 విత్తన కంపెనీలకు సంబంధించిన ప్రతినిధులు, డిస్ట్రిబ్యూటర్లు పాల్గొన్నారు.

ఎఫ్‌సీఐ విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఛైర్మన్‌గా 'బందా'

రవీంద్రనాథ్‌కు ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి శుభాకాంక్షలు



ఎమ్మెల్సీ అప్పిరెడ్డిని సత్కరిస్తున్న బందా రవీంద్రనాథ్ తదితరులు

పట్నంబజారు: పదవీ విరమణ తమ బాధ్యతలు ముగిశాయని అని కాకుండా, సామాజిక సేవతో పది మందికి మేలు చేసేందుకు ముందుకు వచ్చిన ప్రతి ఒక్కరూ అభినందనీయులని ఎమ్మెల్సీ, స్ఫూర్తి ఫౌండేషనన్ వ్యవస్థాపకులు లేళ్ల అప్పిరెడ్డి అన్నారు. అందుకు భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ) విశ్రాంత ఉద్యోగుల నడవడికే ప్రత్యక్ష నిదర్శనమన్నారు. ఎఫ్‌సీఐ విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఛైర్మన్‌గా స్ఫూర్తి ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి, గుంటూరు అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ బందా రవీంద్రనాథ్ తిరిగి రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గుంటూరు అమరావతి రోడ్డులోని మల్లేశ్వరి ఫంక్షన్ హాలులో సోమవారం జరిగిన రాష్ట్ర సమావేశంలో ఈమేరకు ఎన్నికలు నిర్వహించారు. విశాఖపట్నంకు చెందిన ఆలిండియా వైస్ ఛైర్మన్ ఏఎస్ రామారావు, తాడేపల్లిగూడెంకు చెందిన కె సుధాకరరావు ఎన్నికల పరిశీలకులుగా వ్యవహరించారు. బందా రవీంద్రనాథ్‌తోపాటు రాష్ట్ర వైస్ ఛైర్మన్‌గా రాజమండ్రికి చెందిన కె.నాగేశ్వరరావు, కార్యదర్శిగా భీమవరానికి చెందిన జి గోపాలరావు, సహాయ కార్యదర్శిగా విజయవాడకు చెందిన ఆర్ సాయిబాబు, కోశాధికారిగా పశ్చిమ గోదావరికి చెందిన డి మురళీమోహన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గుంటూరు జిల్లా ఛైర్మన్‌గా పి. యలమంద, కోశాధికారిగా ఎస్.ప్రభాకరరావు ఎన్నికయ్యారు. సమావేశానికి ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరైన ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడారు. రాష్ట్ర అధ్యక్షుడు బందా రవీంద్రనాథ్ మాట్లాడుతూ 1990 నుంచి యూనియన్ వ్యవహారాల్లో చురుకైన పాత్ర పోషిస్తున్నట్లు తెలిపారు. అనేక హోదాలలో పనిచేస్తూ 2022లో విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఛైర్మన్‌గా ఎంపికైనట్లు చెప్పారు. తాజాగా జరిగిన ఎన్నికల్లో తనను తిరిగి ఏకగ్రీవంగా ఎన్నుకున్న విశ్రాంత ఉద్యోగులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డిని సత్కరించారు. కార్యక్రమంలో యూనియన్ నేతలు నల్లయ్య, నాగమల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు



మాట్లాడుతున్న గోనుగుంట్ల కోటేశ్వరరావు

గుంటూరు ఎడ్యుకేషన్: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని, విద్యార్థులు, పాఠకులు రోజులో కొంత సమయాన్ని గ్రంథాలయంలో గడిపి విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు అన్నారు. సోమవారం బృందావన్ గార్డెన్స్‌లోని మహిళా బాలల గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాన్ని ప్రారంభించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కోటేశ్వరరావు మాట్లాడుతూ గ్రంథాలయాల్లో భద్రపర్చిన పురాతన గ్రంథాలు చరిత్రకు సజీవ సాక్ష్యంగా నిలుస్తాయన్నారు. ప్రస్తుతం గ్రంథాలయాలకు వచ్చే విద్యార్థులు, పాఠకుల సంఖ్య తగ్గిపోతోందని, ఇది సమాజానికి మంచిది కాదన్నారు. రాష్ట్ర పౌర గ్రంథాలయ శాఖ డైరెక్టర్ ఎ.కృష్ణమోహన్ మాట్లాడుతూ వేసవి విజ్ఞాన శిబిరంలో విద్యార్థులకు పుస్తక పఠనంతో పాటు కథలు చెప్పడం, స్పోకెన్ ఇంగ్లీష్, డ్రాయింగ్, పెయింటింగ్, పేపర్ క్రాఫ్ట్, డాన్స్, జీకే తదితర అంశాల్లో శిక్షణ కల్పిస్తామని తెలిపారు. ఉమ్మడి గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వంకదారి సుబ్బారత్నమ్మ మాట్లాడారు. కార్యక్రమంలో ఏవీకే సుజాత, పౌర గ్రంథాలయ శాఖ డిప్యూటీ డైరెక్టర్ సీహెచ్ దీక్షితులు, జిల్లా గ్రంథాలయ సంస్థ సీనియర్ అసిస్టెంట్ మల్లంపాటి సీతారామయ్య, విశ్రాంత గ్రంథ పాలకుడు ఎస్‌ఎం సుభానీ, అధ్యాపకుడు శివారెడ్డి, మహిళా బాలల గ్రంథాలయ అధికారులు బి.శకుంతల, పి.సత్య శిరీష, గ్రంథాలయ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.